నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

బుధవారం | అక్టోబర్ 25, 2023 | www.navatelangana.com

108లో మహిళ ప్రసవం

నవతెలంగాణ-సిరికొండ

పురిటినొప్పుల బాదపడుతున్న మహిళలకు ఆస్పత్రికి తరలించేలోపే మార్గమధ్యంలో 108లో ప్రసవించింది. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గిరిజన మహిళ జనాబాయి పురిటి నొప్పులు వచ్చాయి. కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. ఆమెను ఇచ్చోడ ప్రాథమిక ఆస్పత్రికి తరలిస్తుండగ, మార్గ మధ్యలోనే 108లో పండంటి ఆడ బిడ్డకి జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని ఈఎంటీ సురేష్, పైలట్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.



విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి

నవతెలంగాణ - దహెగాం

మండలంలోని గెర్రె గ్రామంలో విద్యుత్ షాక్‌తో గావుడె నాగయ్య(63) సోమవారం మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం దసరా పండుగ రోజు పాలపొరక కోసం సమీప అటవీ ప్రాంతానికి వెళ్లాడు. పాలపొరక నరుకుతుండగా పైనున్న విద్యుత్ తీగలకు తగిలి షాక్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు కుటుంబీలకు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.



రక్తదానానికి నిజామాబాద్ వెళ్లిన ఆదిలాబాద్ యువకుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అత్యవసర సమయంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్న సందర్భాలు అనేకంగా ఉన్నాయి. రక్తదాన కోసం ఆదిలాబాద్ నుంచి నిజామాబాద్‌కు వెళ్లి ఉదారతను చాటుకున్నాడు యువకుడు. నిర్మల్ రూరల్ మండలానికి చెందిన రాజ్ మహ్మద్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. సర్జరీ చేయాలని వైద్యులు సూచించగా నిజామాబాద్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్జరీకి ఆరు యూనిట్ల రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. రేర్‌గా దొరికే బీ నెగెటివ్ గ్రూప్ కావడంతో కుటుంబ సభ్యులు నాలుగు రోజుల నుంచి ప్రయత్నిస్తున్నారు. స్నేహితుల ద్వారా విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన గాజరి రజినీకాంత్, నిజామాబాద్ జిల్లా మెండోరా మండలం చాకిర్యాల గ్రామానికి చెందిన రాజీవ్, మోర్తాడ్ మండలానికి చెందిన సాయికుమార్ స్పందించారు. ముగ్గురు కలిసి ఆ ఆస్పత్రికి సోమవారం వెళ్లి మూడు యూనిట్లను రక్తదానం చేశారు. దీంతో రాజ్‌మహ్మద్ కుటుంబీకులు వీరికి ధన్యవాదలు తెలిపారు.

బీఆర్ఎస్‌లో పలువురు యువకుల చేరిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పలువురు యువకులు మంగళవారం ఎమ్మెల్యే జోగురామన్న సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాబిర్ పటేల్, జునైద్ అహ్మద్, నదీమ్, షాహిద్, అఫ్రోజ్‌తో పాటు పలువురు యువకులు పార్టీలో చేరి రామన్న నాయకత్వాన్ని బలపరిచారు. ఈ మేరకు ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ నియోజకవర్గ వాసుల చిరకాల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఎంతగానో కృషి చేశామని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అన్ని రంగాల్లో ఆదిలాబాద్ అభివృద్ధి పథాన దూసుకెళ్తోందని, అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే యువత బీఆర్ఎస్‌లో చేరేందుకు అసక్తి చూపుతున్నారని తెలిపారు. సోషల్ మీడియాలో కీలకంగా వ్యవహరిస్తున్న యువకులు సైతం బీఆర్ఎస్‌లో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రానున్న ఎన్నికల్లో అభివృద్ధికే పట్టం కట్టాలని పేర్కొన్నారు. ఐటీ టవర్, వ్యవసాయ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుతో యువతకు ఉజ్వల భవిష్యత్తు అందనుందని, అదేవిధంగా రైల్వే ఓవర్ బ్రిడ్జ్, అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు సైతం పూర్తయితే ప్రజల ఇక్కట్లు తీరుతాయని అన్నారు. సీసీఐ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించినా కేంద్రం నుండి ఎటువంటి స్పందనా లేదని పేర్కొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనోత్సవం

నవతెలంగాణ - దహెగాం

మండల కేంద్రంతో పాటు మండలంలోని బీబ్రా, రాళ్లగూడ తదితర గ్రామాల్లో దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. బీబ్రా గ్రామంలోని దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన లక్కీడ్రాలో దహెగాం ఎంపీడీఓ రాజేశ్వర్‌గౌడ్ 10 గ్రాముల బంగారం చేజిక్కించుకోగా ఏఎన్ఎం జ్యోతి 2.5 గ్రాముల బంగారం, అలాగే వరంగల్‌కు చెందిన రామకృష్ణారెడ్డి 50గ్రాముల వెండి చేజిక్కించుకున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే మండపం వద్ద ప్రత్యేక ఆటల పోటీలు నిర్వహించి మహిళలకు, పిల్లలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించి సమీప పెద్దవాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వేద పండితులు బాచంపెల్లి కిశోర్‌శర్మ, మహేష్‌శర్మ, పరమేశ్వర్ శర్మ ఆలయ కమిటీ నిర్వాహకులు బండ రమేష్, బండ కృష్ణమూర్తి, చిలువేరు ప్రశాంత్, నాయికిని లక్ష్మణ్, పెద్దసంఖ్యలో భక్తుల పాల్గొన్నారు.

ఘనంగా దసరా

నవతెలంగాణ-దహెగాం

మండలంలోని వివిధ గ్రామాల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జమ్మి చెట్టు వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మి ఆకును తెప్పుకొచ్చి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



ఖానాపూర్ నియోజకవర్గంలో గిరిజనులకే పట్టం..!

- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్ వరకు సాగిన ప్రస్థానం
- నియోజకవర్గంలో 11సార్లు అసెంబ్లీ ఎన్నికలు
- నాలుగు సార్లు టీడీపీ..హ్యాట్రిక్ సాధించిన కాంగ్రెస్, టీఆర్ఎస్
- ఆసక్తికరం ఖానాపూర్ నియోజకవర్గ రాజకీయం
- మొత్తం ఓటర్లు 2,05,751, పురుషులు 1,01201, స్త్రీలు 1,04,537, ఇతరులు 13
- మొత్తం పోలింగ్ బూత్‌లు - 305

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ నియోజకవర్గం మూడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండటం గమనార్హం. జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం ఈ నియోజకవర్గం నిర్మల్ జిల్లాలో ఉన్నా దీని పరిధిలోని కొన్ని మండలాలు మాత్రం ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఉండటం విశేషం. జన్నారం మండలం మంచిర్యాల జిల్లా పరిధిలోకి రాగా.. ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాలు మాత్రం ఆదిలాబాద్ జిల్లాలోకి వస్తాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాలు రెండు జిల్లాల పరిధిలో విస్తరించి ఉండగా.. ఈ నియోజకవర్గం ఒక్కటే మూడు జిల్లాల పరిధిలో ఉంది. గిరిజనులకు రిజర్వ్ చేయబడిన ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు తొలి నుంచి ఆసక్తికరంగా మారుతున్నాయి. ఆదిలో హస్తం పార్టీ మూడు సార్లు గెలుపొంది హవా కొనసాగించగా.. మారిన పరిణామాలతో తెలుగుదేశం పార్టీ నాలుగు సార్లు సత్తాచాటింది. తాజాగా బీఆర్ఎస్ మూడు సార్లు ఈ నియోజకవర్గంలో పాగా వేసింది. ప్రస్తుతం టీడీపీ పూర్వవైభవాన్ని కోల్పోగా.. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌తో పాటు బీజేపీ త్వరంలో జరగనున్న ఎన్నికల్లో పోటీ పడనున్నాయి.




నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆదివాసీ, లంబాడా, ఇతర సామాజిక వర్గాల జనాభా కలిగి ఉన్న ఖానాపూర్ నియోజకవర్గం పరిధిలో 8 మండలాలు ఉన్నాయి. వీటిలో ఖానాపూర్, పెంబి, కడెం, దస్తురాబాద్, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన 1978లో ఏర్పడిన ఖానాపూర్ నియోజకవర్గం ఎస్టీలకు రిజర్వ్ చేయబడింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా రేఖానాయక్ కొనసాగుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11సార్లు అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించగా.. కాంగ్రెస్ పార్టీ 3 సార్లు, టీడీపీ నుంచి 4 సార్లు, టీఆర్ఎస్ నుంచి 3 సార్లు అభ్యర్థులు గెలిచారు. ఒకసారి మాత్రం ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. 1978లో మొట్టమొదటి సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా లంబాడ సామాజిక వర్గానికి చెందిన అంబాజీ జాదవ్ గెలిచారు. 1983 లో రెండవసారి కూడా ఆయన అదే పార్టీ నుంచి విజయం సాధించారు. 1985లో వచ్చిన మధ్యంతర ఎన్నికల్లో ఆజ్మీరా గోవింద్ నాయక్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి తన ప్రత్యర్థి జాలం సింగ్‌పై గెలిచారు. 1989 ఎన్నికల్లో గోండ్ సామాజిక వర్గానికి చెందిన కోట్నాక్ భీంరావు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి గోవింద్ నాయక్‌ను ఓడించారు. ఆ పర్యాయం కోట్నాక్ భీంరావ్‌కు గిరిజన శాఖ మంత్రిగా కూడా అవకాశం లభించింది. నియోజకవర్గం నుంచి మంత్రిగా పనిచేసిన ఘనత ఇప్పటి వరకు ఆయనకు మాత్రమే దక్కింది. మరోపక్క 1994లో టీడీపీ నుంచి పోటీచేసిన గోవింద్‌నాయక్ తన ప్రత్యర్థి కోట్నాక్ భీంరావ్‌ను ఓడించి రెండవసారి ఎమ్మెల్యేగా కొనసాగారు. 1999లో టీడీపీ నుంచి పోటీ చేసిన రాథోడ్ రమేష్ తన ప్రత్యర్థి బక్షీనాయక్‌ను ఓడించి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2004లో టీఆర్ఎస్ నుంచి పోటీచేసిన గోవింద్ నాయక్ తన ప్రత్యర్థి రాథోడ్ రమేష్‌ను ఓడించి మూడవ సారి ఎమ్మెల్యేగా పనిచేశారు. 2008లో మెస్రం నాగోరావ్‌పై టీడీపీ నుంచి పోటీచేసిన సుమన్ రాథోడ్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆమె గెలిచిన ఏడాదికే 2009లో మళ్లీ ఎన్నికలు రావడంతో ఆ ఎన్నికల్లో ప్రత్యర్థి హరినాయక్‌ను ఓడించి సుమన్ రాథోడ్ రెండవసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో రితీష్ రాథోడ్‌ను ఓడించి టీఆర్ఎస్ పార్టీ నుంచి ఆజ్మీరా రేఖానాయక్ తొలి విజయాన్ని సాధించారు. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో అదే పార్టీ నుంచి పోటీ చేసిన రేఖానాయక్ తన ప్రత్యర్థి రాథోడ్ రమేష్‌పై రెండో విజయం సాధించి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న దృష్ట్యా త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజవర్గంలో ఏ పార్టీ పాగా వేస్తుందో చూడాలి.

నియోజకవర్గంలో ఇప్పటి వరకు గెలిచిన పార్టీ అభ్యర్థులు, ప్రత్యర్థుల వివరాలు..

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	సమీప ప్రత్యర్థి
1978	అంబాజీ(కాంగ్రెస్.ఐ)	ఎస్.ఏ.దేవ్‌షా(కాంగ్రెస్)
1983	అంబాజీ(కాంగ్రెస్)	ఏ.గోవింద్‌నాయక్(టీడీపీ)
1985	ఏ.గోవింద్‌నాయక్(స్వతంత్ర)	బి.జాలంసింగ్ (టీడీపీ)
1989	కె.భీంరావు (కాంగ్రెస్)	ఏ.గోవింద్‌నాయక్(టీడీపీ)
1994	ఏ.గోవింద్‌నాయక్(టీడీపీ)	కె.భీంరావు (కాంగ్రెస్)
1999	రాథోడ్ రమేష్(టీడీపీ)	ఎల్.భక్షీనాయక్(కాంగ్రెస్)
2004	ఎ.గోవింద్‌నాయక్(టీఆర్ఎస్)	రమేష్‌రాథోడ్(టీడీపీ)
2008	సుమన్‌రాథోడ్ (టీడీపీ)	మేస్రం నాగోరావు(కాంగ్రెస్)
2009	సుమన్‌రాథోడ్ (టీడీపీ)	హరినాయక్(కాంగ్రెస్)
2014	రేఖానాయక్ (టీఆర్ఎస్)	రితీష్‌రాథోడ్(టీడీపీ)
2018	రేఖానాయక్(టీఆర్ఎస్)	రమేష్‌రాథోడ్(కాంగ్రెస్)



అంబాజీ



కొట్నాక్ భీంరావ్



గోవింద్ నాయక్



రాథోడ్ రమేష్



సుమన్ రాథోడ్



రేఖానాయక్



టికెట్ కేటాయింపులో జాప్యం

- కాంగ్రెస్ శ్రేణుల్లో నైరాశ్యం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఇంకా అభ్యర్థులను కేటాయించలేదు. ఇప్పటికే బీఆర్ఎస్, బీజేపీలు వారి అభ్యర్థులను ప్రకటించగా.. వారు క్షేత్రస్థాయిలో ప్రచారం మొదలు పెట్టారు. కానీ ఇప్పటి వరకు తమ ఏ అభ్యర్థి కోసం ప్రచారం చేయాలో తెలియక కాంగ్రెస్ శ్రేణులు నైరాశ్యంలో ఉన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో ఇప్పటికే అనేక మంది ఆశావహులున్నారు. టికెట్టు ఎవరికి వస్తుంది.. ఎవరి కోసం పని చేయాలో తెలియక అయోమయంలో ఉన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అభ్యర్థిని ప్రకటించడంలో కాంగ్రెస్ అదిష్టానం చేస్తున్న జాప్యంతో కార్యకర్తల్లో నైరాశ్యం కనిపిస్తోంది. నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ ఇపటికే గ్రామాల్లో పర్యటనలు చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి రమేష్ రాథోడ్ తనకు టికెట్ ఖరారైన మరుసటి రోజునుంచే కార్యకర్తలను సమన్వయ పరిచి ప్రచారం షురూ చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రచార రథాలు గ్రామాల్లో తిరుగుతుండడంతో కాంగ్రెస్ శ్రేణులు మాత్రం స్తబ్దంగా ఉన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్ది ప్రచార నిర్వాహణ ప్రణాళిక లేకపోవడం ఇది పార్టీకి మైనాస్ పాయింట్ అవుతుందని వారు భావిస్తున్నారు. బీజేపీ కంటే ముందే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేరును ప్రకటిస్తారని ఆపార్టీ కార్యకర్తలంతా భావించారు. కానీ తొలి జాబితాలో ఖానాపూర్ అభ్యర్థి పేరును ప్రకటించ లేదు. రెండవ జాబితాను ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ పరిణామాన్ని పార్టీ కార్యకర్తలు సహించలేకపోతున్నారు. ఇతర పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉంటే తాము ఇంకా అభ్యర్థినే ఖరారు చేయలేదని, ఎన్నికల ప్రచారానికి మరో 35 రోజుల సమయం మాత్రమే ఉందని, పార్టీ అభ్యర్థిని త్వరగా ప్రకటించాలని కోరుతున్నారు. ఖానాపూర్ నుంచి వెడ్మబొజ్జు పేరును మొదటి జాబితాలోనే ప్రకటిస్తారని పార్టీ కార్యకర్తలంతా భావించారు. కానీ మొదటి జాబితాలో ఆయన పేరు రాలేదు. జాబితా ప్రకటించిన సమయానికి రేఖానాయక్ బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారు. టికెట్ వెడ్మ బొజ్జుకే ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతున్న క్రమంలో ఎమ్మెల్యే రేఖానాయక్ పార్టీలో చేరారు. ఈక్రమంలో టికెట్ కెటాయింపులో జరుగుతున్న జాప్యానికి ఆమె చేరిక కూడా ఒక కారణంగా చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో తిరిగే కార్యకర్తలు మాత్రం అదిష్టానం చేస్తున్న జాప్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచానికి బుద్ధుని బోధనలు చాలా అవసరం

నవతెలంగాణ-జైనథ్



సమస్యలను యుద్దాలతో కాకుండా శాంతియుతంగా వరిష్కరించుకొవడానికి ప్రపంచానికి బుద్ధుని బోధనలు అత్యంత అవసరమని లక్ష్మీపూర్ మహార్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు భగత్ భీంరావ్, బద్రే సుభాష్ పేర్కొన్నారు. సోమవారం లక్ష్మీపూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట అశోక విజయదశమి, దమ్మ చక్ర పరివర్తన్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా గౌతమ బుద్ధ, బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పంచరంగ్ జెండాను ఎగురవేసి, త్రిశర్, పంచశీల్(వందన) పఠించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ బౌద్ధ ధర్మంతో సమస్త మానవాళికి స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వాన్ని ప్రసాదించిన సమతా మూర్తి, మానవతా వాది అని కొనియాడారు. అఖండ భారత దేశాన్ని పరిపాలించిన అశోక చక్రవర్తి యుద్ధాన్ని విడనాడి బుద్ధుడి మార్గంలో ప్రయాణం మొదలుపెట్టిన రోజు, ప్రపంచ జ్ఞాన సూర్యుడు బాబాసాహెబ్ అంబేద్కర్ తన కుటుంబ సమేతంగా బౌద్ధ ధర్మం స్వీకరించన రోజే అశోక విజయదశమి అన్నారు. వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భగత్ అశోక్, యువకులు పాల్గొన్నారు.

చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి



నవతెలంగాణ -ఆదిలాబాద్‌అర్బన్

చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకుంటారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దసరా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు నవరాత్రులలో అమ్మవారికి ప్రత్యేక పూజలందించిన భక్తులు దసరా పండగను జరుపుకుంటారు. ఈ మేరకు హిందూ సమాజ ఉత్సవ సమితి అధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం నుండి ప్రారంభమైన శోభాయాత్ర దసరా మైదానానికి చేరుకోగా అక్కడ రావణ దహనం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులతో పాటు ఎమ్మెల్యే జోగు రామన్న, రాజకీయ నాయకులు, ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు. ముందుగా కార్యక్రమానికి హాజరైన అశేష జనవాహిని నడుమ అతిథులు ప్రసంగించారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ శమి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ రావణ ప్రతిమకు నిప్పంటించారు. అంతకుముందు నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలో ఆకర్షణీయంగా వినాయక మండపాలను ఏర్పాటు చేసిన నిర్వాహకులకు బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ హిందూ ధర్మంలోని అన్ని పండగలను ప్రతి ఏడు గొప్పగా జరుపుకుంటామని, చెడుపై మంచి విజయం సాధించిన రోజుగా జరుపుకునే విజయ దశమిని ప్రతి ఒక్కరు ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరు తమలోని చెడును జయించి సన్మార్గంలో నడవాలని సూచించారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. అంతకుముందు ఎస్పీ ఉదయ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి ఆశీర్వాదాలతో అందరికి మంచే జరగాలని, జిల్లాకు మరింత పేరు ప్రఖ్యాతులు రావాలని ఆకాంక్షించారు.



ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రానికి చెందిన గుండుగుల మారుతి మృతి చెందడంతో సోమవారం కుటుంబాన్ని



స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి పరామర్శించి అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కోర్రాల మహేందర్, ఎల్లప్ప, భీమన్న, శ్రీనివాస్, శంకర్, రెడ్డి పాల్గొన్నారు.

సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడాలి

నవతెలంగాణ-నార్నూర్

సంస్కృతి సాంప్రదాయాలను కాపాడి భావితరాలకు అందించాలని స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విజయ్ నగర్ కాలనీలో నిర్వహించిన మహాలక్ష్మి కలశ పూజలో పాల్గొన్నారు. అనంతరం మహాలక్ష్మి మందిరం నుంచి పల్లె ప్రకృతి వనం వరకు తీజ్ ఊరేగింపులో పాలు పంచుకున్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్ చౌహాన్, గ్రామ పెద్దలు ఫకీరా నాయక్, అనిల్ నాయక్, దిలీప్ రాథోడ్, భారత్ రాథోడ్, దేవుకా బాయి, చౌహాన్ సురేష్, బీఆర్ఎస్ నాయకులు కోర్రల మహేందర్ గ్రామస్తులు, మహిళలు, యువతులు పాల్గొన్నారు.



ఆవు దూడపై పులి దాడి



నవతెలంగాణ-తాంసి

ఆవు దూడపై పులి దాడి చేసిన సంఘటన మంగళవారం పిప్పల్‌కోటి రిజర్వాయర్ పరిసర ప్రాంతంలో చోటు చేసుకుంది. పశువుల కాపరి తెలిపిన వివరాల ప్రకారం.. పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన పశువుల కాపరి పొచ్చన్న ఎప్పటి లాగే పశువులను మేపటానికి పోయాడు రిజర్వాయర్ అటవీ ప్రాంతంలో గోపాల్‌కు చెందిన లేగ దూడపై పులి దాడి చేయగా ఒక్క సారిగా పశువులు అన్ని భయపడి పరుగులు తీశాయి పశువుల కాపరి గమనించి కేకలు వేయగా, చుట్టూ పక్కల పంట పొలాల్లో ఉన్న వారు రావడంతో పులి అక్కడి నుంచి వెళ్లి పోయినట్లు తెలిపారు. లేగా దూడ మెడపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రాణాపాయ స్థితిలో లేగ దూడ ఉంది. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు తమ సిబ్బందితో వచ్చి దాడి జరిగిన పరిసర ప్రాంతంలో సీసీ కెమెరాలు ఎర్పాటు చేసి చేస్తున్నట్టు తెలిపారు. లేగ దూడ మెడపై ఉన్న గాయాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. చుట్టూ పక్కల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పోలీసు సాయుధ భాండాగారంలో ఆయుధ పూజ



ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి, పోలీసు అధికారులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విజయదశమి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని ఆయుధ భాండాగార మందిరంలో పోలీసు అధికారులు వేద పండితులు సాంప్రదాయబద్ధంగా దుర్గామాత సన్నిధిలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి షమీ చెట్టు వద్ద పూజలు నిర్వహించి, విజయానికి చిహ్నంగా ఆకాశం వైపు తుపాకితో ఐదు రౌండ్లని కాల్చి విజయదశమిని ప్రారంభించారు. అనంతరం సాయుద పోలీస్ విభాగంలో పనిచేస్తున్న డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్ టీం, పోలీసు వాహనాలు తదితర విభాగాల్లో సిబ్బందితో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరణ నెలకొల్పడానికి పోలీస్ శాఖ అహర్నిశలు శ్రమిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా దుర్గాదేవి నిమజ్జన శోభాయాత్ర అర్ధరాత్రి వరకు కొనసాగి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా పూర్తయిందని తెలిపారు. పోలీస్‌శాఖలో ఆయుధాలు కీలకపాత్ర పోషిస్తాయని, సాయిధ బలగాల సంరక్షణలో భద్రపరుస్తారని తెలిపారు. జిల్లా ప్రజలందరికీ విజయదశమి సందర్భంగా విజయం చేకూరాలని కోరుకుంటూ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నవీన్, టి మురళి, స్వామి, రిజర్వ్ సబ్ ఇన్స్‌పెక్టర్లు విజయ్, రాకేష్, రిజర్వ్ సిబ్బంది డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ టీం, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దసరా వేడుకలు



నవతెలంగాణ-నార్నూర్

దసరా పండుగను పురస్కరించుకొని మంగళవారం మండలంలోని ప్రజలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోనీ ఖాందేవ్ ఆలయంలో ఆదివాసులు తొడసం వంశస్తులు దసరా పండగ సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో మహిళలు పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం మండపంలో నిర్వహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో దసరా పండగను సంస్కృతి, సాంప్రదాయాల బద్ధంగా గిరిజన ఆదివాసీలు ప్రత్యేకపూజలు చేసి ఒక్కరికొకరు దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావ్, పూజారులు తొడసం తెలంగ్‌రావ్, తొడసం రాజు, ఆనంద్‌రావ్, భీంరావ్, గంగారాం, జంగు, దేవరావ్, యాదవ్ రావ్, రామారావ్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండలకేంద్రంలో మంగళవారం దసరా పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. సాయి బాబా ఆలయ సమీపంలోని జమ్మి చెట్టుకు పూజ చేసి, అనంతరం రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగను నిర్వహించుకుంటామని అన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభ కాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్ మోసపూరిత హామీలు ప్రజలు నమ్మరు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేసీఆర్ ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నారని దీనిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఖానాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాథోడ్ రమేష్ ధ్వజమెత్తారు. మంగళవారం హర్కాపూర్, అంద్‌గూడ, హర్కాపూర్ తండలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా దుర్గాదేవి, హనుమాన్ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయనకు భాజా భజంత్రీలతో స్వాగతం పలికారు. ఖానాపూర్‌లో గెలిచేది బీజేపీ పార్టీయేనని జ్యోస్యం చెప్పారు. ఇన్ని రోజులు ఒక రేషన్ కార్డు అందించని ప్రభుత్వం ఇక నుంచి సన్న బియ్యం, మహిళలకు పింఛను, 400లకు సిలెండరు, ఇస్తామంటూ మరొక సారి తెలంగాణ ప్రజలకు మోసగించడమేనని ఆరోపించారు. కానీ ప్రజలు ఆయనకు రాబోయే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మరప్ప రాజు, మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారంలో కొస్తే గ్రామీణ రోడ్ల సమస్యలు పరిష్కరిస్తాం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఉట్నూర్

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలో వస్తే గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల సమస్యలు పరిష్కరిస్తామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడ గ్రామపంచాయతీ పరిధిలోని రాంపూర్(కే) గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పరచడంలో పూర్తిగా విఫలమయ్యిందన్నారు. నియోజకవర్గంలో ఏ ఊరికి వెళ్లిన రోడ్డు సమస్య, నీటి సమస్యలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎ ఆదివాసీ గూడకు వెళ్లిన దుర్భరమైన రోడ్లు దర్శనమిస్తున్నాయని, దానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. కాంగ్రెస్ అధికారంలో వస్తే ప్రతి గ్రామంలో రోడ్లు వేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలతో పాటు మేనిఫెస్టోలను ప్రజలకు వివరించి, కరపత్రాలను విడుదల చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుం, రాంపూర్(కే) గ్రామ పటేల్ విషంరావ్, నాయకులు హైహ్మద్, మాజీద్, హాజీమ్ ఖాన్, వాజీద్ ఖాన్, నగేష్, సుధాకర్ ఉన్నారు.

ఆర్టీసీ డిపోలో ఆయుధ పూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దసరా పండుగ సందర్భంగా ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆదిలాబాద్ డిపో మేనేజర్ కే.కల్పన పేర్కొన్నారు. దసరా పండుగను పరిష్కరించుకొని ఆర్టీసీ డిపో కార్యాలయంలో సోమవారం ఆయుధపూజను ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులతో పాటు, మెకానిక్ పరికరాలకు ఆమె పూజలు నిర్వహించారు. ఆర్టీసీ ద్వారా ప్రజల సౌకర్యార్థం వివిధ రకాల సౌకర్యాలను కల్పిస్తున్నామని, ప్రజలు ఆర్టీసీని ఆదరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని శ్రీరామ మందిరం, ఏకనాథ్ ఆలయం, దాస హనుమాన్, వీరహనుమాన్ ఆలయల సన్నిధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నిమజ్జనం సోమవారం రోజున ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు తొమ్మిది రోజులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నిత్యం అన్నదానం, హోమం, బోనాలు సమర్పించిన అనంతరం దసర రోజున దుర్గాదేవి నిమజ్జనం చేశారు. దేవి ఊరేగింపులో మహిళలు నృత్యాలు అందరినీ అలరించాయి. మహిళలు మంగళ హారతులతో దేవిని సాగనంపారు. దుర్గామాత నిమజ్జనం తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు ఆయ గ్రామాల్లో సోమవారం దుర్గామాత నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా తొమ్మిది రోజులు ప్రత్యేక మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్టించి శరన్నవరాత్రులు ముగియడంతో విగ్రహాలను వాహనాల్లో ఎక్కించి అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు మంగళ హారతులతో డీజే చప్పుళ్ల మధ్య కొలాటలతో పాటు నృత్యాలు చేస్తూ గ్రామ సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనంలో బీఆర్ఎస్ నాయకురాలు దివ్యరెడ్డి, మండలంలోని ఆలూర్, బోరిగాం, గ్రామంలోని దుర్గా మాతలను సోమవారం నిర్మల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు అల్లోల దివ్యా రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం దుర్గమాతల నిమజ్జన శుభ యాత్ర లో పాల్గొని గుస్సాడీ నృత్యం చేసి మహిళతో అడి పాడారు. వారి వెంట ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రితరెడ్డి, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా 67వ ధమ్మచక్ర పరివర్తన్ దివస్



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సర్పంచ్ గజానంద్‌నాయక్, వివిధ గ్రామాల ప్రజలు

నవతెలంగాణ-నార్నూర్

విజయదశమిని పురస్కరించుకొని మంగళవారం మండల కేంద్రంతో పాటు భోస్పాపూర్, మహాగావ్, మాన్కాపూర్, భీంపూర్ కొత్తపెల్లి, తాడిహత్నూర్ గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్, గౌతమ బుద్ధుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘనంగా 67వ ధమ్మచక్ర పరివర్తన్ దివస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి, బడుగు బలహీన వర్గాల కోసం జీవితాంతం కృషి చేసిన మహానుభావుడని అన్నారు. ప్రపంచానికి మానవత్వం శాంతి సమానత్వ సందేశం అందించిన బుద్ధుడి మార్గంలో నడవాలని బాబాసాహెబ్ అంబేద్కర్ బౌద్ధం స్వీకరించారన్నారు. భవిష్యత్తు తరాలు ఆ మహానుభావులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్, ఫ్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, ఎంపీటీసీ కొలట్కర్ పరమేశ్వర్, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి, దళిత నాయకులు దేవరావ్ లోకండే, దుర్గే మహేందర్, కోర్రల మహేందర్, రుక్మాబాయి, భీంరావ్ ఝాడే, సంజీవ్ నాయక్, శాంతారావ్, మహాగావ్ సర్పంచ్ రాథోడ్ యశ్వంత్‌రావ్, జాదవ్ సచిన్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-బేల

తొమ్మిదేండ్లు అధికారంలో లేక పోయినా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశామని, ప్రజలు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సదల్‌పూర్‌లోని శ్రీ బైరామ్ దేవ్, మహాదేవ్ ఆలయాన్ని మండల నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ మాట్లాడుతూ తొమ్మిదేండ్లు అధికారంలో ఉన్న ఎమ్మెల్యే జోగు రామన్న అదిలాబాద్ ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. తాము అధికారంలో లేకపోయినా ప్రజా సమస్యల కోసం ఎప్పుడు పోరాడుతూ ప్రజల పక్షాన ఉన్నామని అన్నారు. ఈ సారి ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, కేంద్రంలో ఉన్న మోడీ పాలనలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రాష్టంలో రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని ఈ సారి ప్రజలు మద్దతునిచ్చి గెలిపిస్తే అదిలాబాద్ అభివృద్ధి చేసి చూపెడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు దత్త నిక్కం, బేల ఎంపీటీసీ ఒళ్లఫవార్ జ్యోతి, నాయకులు విజయ్ భోయర్, మురళీధర్ ఠాక్రె, మోరేశ్వర్, బోడకుంట రాకేష్, గణేష్, మహేష్, గోపతి వెంకటి, వడ్డే పోశెట్టి, గజు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి : కంది శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్న అందరికీ విజయదశమి, విజయం చేకూరాలని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్ క్యాంపు కార్యాలయంలో విజయదశమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని కంది తన సతీమణి సాయిమౌనారెడ్డితో కలిసి శాస్త్రోక్తంగా ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. అనంతరం లోక కళ్యాణార్థం ప్రజాసేవా భవన్ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక పూజాది కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రముఖ వేద పండితుడు ప్రవీణ్ శర్మ నేతృత్వంలో సాగిన ఈ పూజలో సతీసమేతంగా కూర్చుని పూజలు చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని, అందరికీ ఆయురోగ్యాలు, అష్టైశ్వర్యాలను ఆ భగవంతుడు ప్రసాదించాలని వేడుకున్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని, విజయ తీరాలని చేరుకోవాలని కోరుతూ నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షులు ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు ఐనేని సంతోష్‌రావు, డేరా కృష్ణారెడ్డి, షకీల్, కొండూరి రవి, మానే శంకర్, మీరాబాయి, తిరుమల్‌రెడ్డి, బూర్ల శంకర్, అన్నెల శంకర్, రాజా లింగన్న, ముఖీమ్, కర్మ అస్బాత్ ఖాన్, అష్రద్‌ఖాన్, హరీష్ రెడ్డి ఉన్నారు.

నేడు సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్

మండలకేంద్రంలోని మార్కెట్‌యార్డులో బుధవారం సోయా కొనుగోళ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్టు సహకార సంఘం సీఈఓ అడే గణేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో సోయా కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు.

సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రాభివృద్ధి



నవతెలంగాణ-సిరికొండ

సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రాబివద్ధి సాధ్యమైందని సర్పంచ్ నర్మద పెంటన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ లేవన్నారు. రైతుల కోసం నిరంతరంగా 24 గంటల కరెంట్‌ను ఇస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని అన్నారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పర్వీన్ లతీఫ్, ఉప సర్పంచ్ తోకల చిన్న రాజన్న, ఇక్బాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన పలువురు యువకులు



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో అనిల్ జాదవ్

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు యువకులు మంగళవారం బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ సమక్షంలో నేరడిగొండలోని తన నివాసంలో యువకులు పార్టీలో చేరారు. వారికి అనిల్ జాదవ్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై నాపై ఉన్న నమ్మకంతో యువకులు పార్టీలో చేరడం జరిగిందన్నారు. నా గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేసి ప్రభుత్వా పథకాలను నూతన మేనిఫెస్టోను ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలన్నారు. కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తలు గుర్తింపు ఉంటుందని అన్నారు. తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ఆయనను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్చప్ యాదవ్, శంకర్‌యాదవ్, నాయకులు గోవర్ధన్ యాదవ్, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టోల్‌ప్లాజా వద్ద మద్యం పట్టివేత

నవతెలంగాణ-జైనథ్



మండలంలోని పిప్పరవాడ టోల్ ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలో అక్రమ మద్యం పట్టుకున్నారు. మహారాష్ట్ర నుండి ఆదిలాబాద్ వైపు వస్తున్న వాహనంలో అక్రమంగా తరలిస్తున్న మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన విరాల ప్రకారం మధ్యప్రదేశ్ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా విస్కీని వినోద్ కుమార్ తరలిస్తున్నాడు. టోల్‌ప్లాజ వద్ద తనిఖీలో అతని వద్ద నుంచి అక్రమ మద్యం లభించిందని, మద్యంతో పాటు కారును సీజ్ చేశామన్నారు. సుంకం చెల్లించకుండా పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకువస్తే చర్యలు తప్పవన్నారు. సీఐ వెంట ఎక్సైజ్ ఎస్సైలు సంధ్యారాణి, సంజీవ్ కుమార్, జైనథ్ ఎస్సై పురుషోత్తం ఉన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | అక్టోబర్ 25, 2023 | www.navatelangana.com

శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలి

నవతెలంగాణ-కెరమెరి

శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఆసిఫాబాద్ డీఎస్పీ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలో పోలీస్, పారా మిలటరీ దళాలతో కలిసి కవాతులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించే వారిపైన దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికలకు ఎలాంటి ఆటంకలు కలిగించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలు ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారమే నడుచుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్సై గుంపుల విజయకుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి బాలుడు మృతి

నవతెలంగాణ-కౌటాల



పూలు కోయడానికి ఇంటి పక్కన ఉన్న బావి గోడపై ఎక్కి కోస్తుండగా కాలుజారి బావిలో పడి బాలుడు మృతిచెందిన సంఘటన మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. కౌటాల ఎస్సై మధూకర్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్ములె భగీరథ్ తన చిన్న కుమారుడు ఎల్ములె సందీప్(13) ఇంటి ప్రక్కనే ఉన్న బావి గోడపై ఎక్కి పూలు కోస్తుండగా బావిలో పడి మృతిచెందినట్టు ఆయన తెలిపారు. తండ్రి భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న చిన్నకుమారుడు బావిలో పడి చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పండుగ పూట ఇలా జరగడంతో అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టుకున్నారు.

జిల్లా కేంద్రంలో ఘనంగా దసరా వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో సోమవారం దసరా వేడుకలు అంబరానంటాయి. కేస్లాపూర్ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో వేలాదిమంది భక్తులు, ప్రముఖులు పాల్గొనగా ఈ వేడుకలు కన్నుల పండుగ జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు వజ్జల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రముఖ టీవీ, సీనీ రచయిత, నటుడు, దర్శక నిర్మాత నాగ బాల సురేష్ కుమార్ పాల్గొనగా భక్తుల సమక్షంలో సాంప్రదాయబద్ధంగా శమీ వృక్ష పూజలు నిర్వహించారు. అనంతరం పూజ ప్రాముఖ్యత గురించి, విజయదశమి విశిష్టత గురించి సురేష్ కుమార్ వివరించారు. విజయదశమి సందర్భంగా శ్రీరామచంద్రుని ఎంపిక కోసం, బంగారం లక్ష్మీ విజేత ఎంపికను భక్తుల సమక్షంలో నిర్వహించారు. శ్రీరామచంద్రునిగా ఆసిఫాబాద్‌కు చెందిన రావుల శివకుమార్, బంగారం లక్ష్మీ విన్నర్‌గా కాంద్రె విశాల్ ఎంపిక కాగా విజేతలను సత్కరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామచంద్రునిగా ఎంపికైన శివకుమార్ తో పాటు ప్రముఖులు రావణ దహన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత వినోద కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు ధర్మపురి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకటేశ్వర్, కోశాధికారి పిన్న వివేక్, ఉపాధ్యక్షులు టి.మురళీధర్ గౌడ్, డాక్టర్ రమేష్, కమిటీ ప్రముఖులు ఎకరాల శ్రీనివాస్, గడ్డల వెంకటేశం, వనం మధుకర్, రాధాకృష్ణ చారి, చిలువేరు వెంకన్న, సాయిని రాజశేఖర్, ప్రహ్లాద్, జీవన్, సుధాకర్, నారాయణమూర్తి, కోట వెంకన్న లక్ష్మణమూర్తి, గోపాల్ నాయక్, ఉదయ్, తిరుపతి పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బుద్ధుని బోధనలు ఎల్లప్పుడు ఆచరణీయమని అంబేద్కర్ సెంట్రల్ కమిటీ నాయకులు అన్నారు. మండలంలోని సాలెగూడా లో నిర్వహించిన వేడుకల్లో పంచశీల జెండా ఆవిష్కరించి బుద్ధుని చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇచ్చి, ఆచరించి చూపిన గౌతమ బుద్ధుడు చూపిన మార్గాన్ని రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ లక్షలాది మంది తన అనుయాయులతో కలిసి 1956 లో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన రోజును ధమ్మ చక్ర పరివర్తన దినంగా జరుపుకుంటారని అన్నారు. బౌద్ధము సకల మానవాళిని సమానంగా చూస్తుందని అన్నారు. బుద్ధుని కాలం లో కులాలు మతాలు లేవని తెలిపారు. సమాజంలో ఉన్నవి రెండే రెండు జాతులని, ఒకటి ఆడ, రెండోది మగ అని ఇప్పుడు ఉన్నటువంటి కులాలు గాని మతాలు కానీ, మనుషుల మధ్య భేదాలు గాని లేవని అందుకే బౌద్ధం ఎల్లప్పుడూ ఆచరణీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చునార్కర్ గణపతి, సాలెగూడా సర్పంచ్ వినోద్, నాయకులు చాపిడి సురేష్, దుర్గం మనోహర్, ముంజం ధర్మ, చాపిడి సునీల్ కుమార్, దుర్గం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



నవతెలంగాణ-పెంచికలపేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పోతపెల్లి గ్రామ సర్పంచ్ దాసరి చంద్రమౌళి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్, అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు దెబ్బటి మహేష్ వారి అనుచరులతో కలిసి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాల్లో ముందుందని, ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులకు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, కొండపెల్లి సర్పంచ్ సంజీవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి ఆలయంలో అన్నదానం

ఆసిఫాబాద్ : పట్టణంలోని పొట్టి శ్రీరాములు చౌక్ సమీపంలో ఉన్న మహాలక్ష్మీ ఆలయంలో మంగళవారం నవరాత్రులను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-కాగజ్‌నగర్



స్వేరోస్ ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

జ్ఞాన సమాజ నిర్మాణమే స్వేరోస్ లక్ష్యమని స్వేరోస్ వ్యవస్థాపకులు, బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. దివంగత ఐఏఎస్ అధికారి ఎస్ఆర్.శంకరన్ జన్మదినం సందర్భంగా వినయ్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన స్వేరోస్ ఆవిర్భావం వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా స్వేరోస్ ముందుకు వెళ్లాలన్నారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందన్న ఆయన రాజ్యాంగాన్ని మార్చేందుకు కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. సావిత్రిబాయి పూలేను చదువుల తల్లిగా ఆరాధిస్తే, కొన్ని మతతత్వ శక్తులు అంగీకరించడం లేదన్నారు. ఓటు హక్కుతో రాజ్యాధికారం సాధించాలని అన్నారు. పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, మహనీయుల ఆశయ సాధనకు స్వేరోస్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సావిత్రిబాయి పూలే మనవరాలు నీతా రమాకాంత్ హెూలే, భంతేజీ దమ్మ సారథి, సిరాజ్ రెహ్మాన్ పాల్గొన్నారు. అంతకు ముందు ఫిట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెక్ పోస్ట్ నుంచి డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో పురుషుల విభాగంలో విన్నర్ గా విజయ్, రన్నర్ గా విక్రాంత్, సుమన్, మహిళల విభాగంలో విన్నర్ గా జ్యోత్స్న, రన్నర్ గా మౌనికలు బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వేరోస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల ప్రవీణ్ కుమార్, చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య, స్వేరోస్ కో-కన్వీనర్ కుమార్ పాల్గొన్నారు.



స్వేరోస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న సభ్యులు

సిర్పూర్ అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యం

సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధి బీఎస్పీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని మారుమూల ప్రాంతాలైన గోంది, దుబ్బగూడలో పర్యటించారు. వచ్చే ఎన్నికల్లో పేదల పక్షాన నిలబడే బీఎస్పీనే గెలిపించాలని కోరారు. కోనేరు కోనప్ప మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా సిర్పూర్ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఆధిపత్య వర్గానికి చెందిన పార్టీలతో సిర్పూర్ నలిగిపోయిందని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం బీఎస్పీని గెలిపించాలన్నారు. ఎన్నికల్లో సిర్పూర్‌లో బీఎస్పీ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మన ఓట్లను దోపిడీ చేసిన డబ్బుతో బీర్లు, బిర్యానీలతో ఆధిపత్య పార్టీలు కొనాలని చూస్తున్నాయని అవి పేదల బతుకులు మార్చవనున్నారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనప్ప సిర్పూర్ అభివృద్ధి ఏం చేశారో ప్రశ్నించుకోవాలన్నారు. పేదలకు నిజమైన రాజ్యాధికారం బీఎస్పీ ద్వారానే సాధ్యమన్నారు. కనీసం రోడ్డు మార్గం కూడా లేని ప్రాంతాల్లో వాగు దాటి కాలినకడన రెండు కిలోమీటర్లు నడిచారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

- కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్
- మండలకేంద్రంలో పారామిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ-కౌటాల



నవంబర్ 30వ తేదీన జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించినట్టు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా తెలిపారు. మండలకేంద్రంలోని బైల్ బజార్ నుండి పారామిలిటరీ దళాల ఫ్లాగ్ మార్చ్‌ను ప్రారంభించారు. పారామిలిటరీ దళాలతో కలిసి మండలకేంద్రంలో బైల్ బజార్ నుండి బస్టాండు మీదుగా బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు కవాతు నిర్వహించారు. అనంతరం పారామిలిటరీ దళాలకు ఎన్నికలకు సంబంధించిన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమీషన్ సూచించిన ప్రకారం విధులు నిర్వహించాలని, రాబోయే శాసనసభ ఎన్నికల సందర్భంగా ఇప్పటి నుండే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 597 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. ఇందులో సాదారణ పోలింగ్ కేంద్రాలు 432 కాగా జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 92 ఉన్నాయన్నారు. ఎల్‌డబ్ల్యుఈ పోలింగ్ కేంద్రాలు 73గా గుర్తించడం జరిగిందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైన చట్టవిరుద్ధంగా వ్యవహరించి గొడవలు సృష్టించాలని చూస్తూ వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలంతా ఎలాంటి గొడవలకు తావివ్వకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడే గ్రామాల అభివృద్ధి చెందుతాయన్నారు. వర్గ బేదాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేల ప్రతి ఒక్కరు సహకరించాలని, ఒకరికొకరు కలిసిమెలిసి సామరస్యంగా ఉండాలన్నారు. ఓటర్లు పోలింగ్ సమయంలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్ఐలు మధూకర్, దీకొండ రమేష్, పారామిలిటరీ దళాలు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్ : మండలంలోని ఈజ్‌గాం, కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల పలు ఏరియాల్లో సోమవారం సాయంత్రం సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈజ్‌గాం చౌరస్తా నుంచి మార్కెట్ ఏరియా వరకు, కోయవాగు, చింతగూడ గ్రామాల్లో ఈ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టౌన్ సీఐ బుద్దే స్వామి, రూరల్ సీఐ నాగరాజు, ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్, రూరల్ ఎస్సై సోనియా పాల్గొన్నారు.

బీఆర్ఎస్ స్కాంల ప్రభుత్వం : రావి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి కోసం స్కీంలు ప్రవేశపెట్టి స్కాంలు చేయడమే తప్పా న్యాయం జరగలేదని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం స్కీంల పేరిట స్కాంలే తప్పా నోటిఫికేషన్‌ల పేరిట విద్యార్థులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఇచ్చిన వాగ్దానాలు పెద్దవాగులో కలపాలని, కొన్ని సంవత్సరాల నుండి పెద్దవాగుపై నిర్మించనున్న జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు, అదేవిధంగా మరుగునపడిన లిఫ్టిరిగేషన్‌ను పట్టించుకోకుండా రైతులకు తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. నియోజకవర్గంలో సాగు నీటి సమస్య ఉందని, దీనిపై ఏనాడు దృష్టి సారించకుండా తన అనుచర వర్గానికి లాభాదాయకమైన అక్రమ పనులు చేయడమే తప్పా సిర్పూర్ మండలానికి చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రంలో పలు విద్యాసంస్థలను, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఉండాలి కానీ తన స్వార్థం కోసం కాగజ్‌నగర్ పట్టణంలో ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టును పూర్తిచేస్తామని, రైతులకు, ప్రజలకు ఎల్లప్పుడు సాగునీరు అందేలా చేస్తానని, కాంగ్రెస్ ఎన్నికల మెనీఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారెంటీ పథకాలే ప్రజలు ఆశీర్వదిస్తారన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు, జిల్లా బోర్‌వెల్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు మహ్మద్ అమీనొద్దీన్, యువతకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సమీర్, ముసీద్, వికలాంగుల జిల్లా అధ్యక్షుడు ఇప్ప రవిశంకర్ పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ కె.సురేష్ కుమార్



నవతెలంగాణ-రెబ్బెన

స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని కుమురం భీం ఆసిఫాబాద్ ఎస్పీ కే.సురేష్ కుమార్ పోలీసులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ని ఆకస్మిక తనిఖీ చేశారు. విధుల గురించి ఎస్సై చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. కేసులకు సంబంధించిన ఫైళ్లను, పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపుర్వకంగా ఉంటూ సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల మద్యే ఉంటూ పని చేస్తున్న పోలీసుల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని ఆదేశించారు. నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలో గస్తీ వాహనాలు నిరంతరం తిరగాలన్నారు. స్టేషన్ రికార్డులతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ సిబ్బంది విధివిధానాలను సూచించే 5ఎస్ విధానాన్ని స్టేషన్‌లో అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధమ్మచక్ర పరివర్తన్ దివస్



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో 67వ ధమ్మచక్ర పరివర్తన్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, గౌతమ్ బుద్ధ, మాత రమాబాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి, త్రీవందన్ పాటించారు. అనంతరం బౌద్ధ మహాసభ అధ్యక్షులు రౌత్ భావుజీ పంచశీల్ జెండాను ఎగరవేశారు. బౌద్ధ ధర్మంతో సమస్త మానవాళికి స్వేచ్ఛ సమానత్వం ప్రసాదించిన సమతా మూర్తి, మానవతావాది బాబాసాహెబ్ అంబేద్కర్ అని బౌద్ధ మహాసభ అధ్యక్షుడు రౌత్ భావుజీ కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలు యువకులు పాల్గొన్నారు.

ఘనంగా దేవీ నిమజ్జన వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న దేవి నిమజ్జన వేడుకలు జిల్లా కేంద్రంలో మంగళవారం నుండి ప్రారంభమయ్యాయి. దేవి విగ్రహాలను నిర్వాణ కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. వాసవి మందిర్, రావులవాడ, బాపునగర్‌తో పాటు పలు కాలనీలో ప్రతిష్ఠించిన దేవి విగ్రహాలను ప్రత్యేకంగా ఆలంకరించిన వాహనంలో నిమజ్జనానికి తరలించారు.

ఆకట్టుకున్న శారద గణేష్ మండలి వేడుకలు

తొమ్మిది రోజులుగా ప్రతిరోజు వివిధ రకాల కార్యక్రమాలు, బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్న శారద గణేష్ మండలి బాపునగర్ మండలి నిర్వాహకులు నిమజ్జనంలో కూడా ప్రత్యేకతను చాటుకున్నారు. మండలి వద్ద నుండి శోభాయాత్రగా వెళ్లిన దేవి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేయడంతో పాటు, మహిళలు నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక దుస్తులు ధరించి కోలాటాలు, నృత్యాల మధ్య నిమజ్జన వేడుకలు నిర్వహించారు. అంతకు ముందు దేవికి వేసిన రూపాయల దండ వేలం వేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు పుల్లూరి రవీందర్, అశ్విన్, వివేక్, సుగుణాకర్, బాలేష్ గౌడ్, శ్రీనివాస్, గీత, మంగ, మహేందర్, ఆనంద్, రజినీ, శిరీష, దేవేంద్ర, శ్రీనివాస్ గౌడ్, ప్రతాప్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు పూర్తి చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారు: సీపీఐ(ఎం)

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు దశాబ్దాల కాలంగా పూర్తి చేయకుండా తిరిగి ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని సీపీఐ(ఎం) నాయకులు ముంజం ఆనంద్ కుమార్ ప్రశ్నించారు. 2005లో రూ.124.64 కోట్లతో ప్రారంభమైన ప్రాజెక్టు నేటికీ నిర్మాణ దశలోనే ఉండడం పాలకులకు సిగ్గుచేటన్నారు. ప్రాజెక్టు పూర్తయితే 15 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. ప్రతీ ఏటా బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం 17 సంవత్సరాలుగా ఈ ప్రాజెక్టు పనులు ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కు అన్నట్టుగా సాగుతున్నాయన్నారు. 85 శాతం పనులు పూర్తి కాగా కాల్వ నిర్మాణం చివరి దశలో ఉందని, కేవలం మరో రూ.10 కోట్లు విడుదల చేస్తే భూసేకరణ ప్రక్రియ పూర్తై ప్రాజెక్టును కొంత మేరకయినా వినియోగంలోకి తెచ్చుకునే అవకాశం ఉందన్నారు.

ఈత సరదా తీసిన ప్రాణం

- పండగ పూట విషాదం

నవతెలంగాణ-భీమిని



ఈత సరదా ప్రాణాల మీదకు వస్తున్న సంఘటనలు అనేకం ఉన్న మార్పు రావడం లేదు. మండలంలోని చిన్నగుడిపేటకు చెందిన తొగరి దుషాంత్(30) సోమవారం సాయంత్రం సరదాగా గ్రామంలోని చెరువుకు ఈతకు వెళ్లాడు. ప్రమాదవశత్తు మునిగిపోగాడు, అతనితో ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో మునిపోయాడు. రాత్రి నుంచి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికిన ఆచూకి లభించలేదు. చెరువులో మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గాలింపుచేపట్టగా దుషాంత్ మృతదేహం లభించింది. పండట పూట ఆనందంగా గడపల్సిన ఇంట్లో దుషాంత్ మరణంతో రోదనాలు మిన్నంటాయి. తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

దేశీదారు పట్టివేత

నవతెలంగాణ-తలమడుగు



రుయ్యాడి గ్రామానికి చెందిన మావురపు వెంకటేష్ వద్ద మహారాష్ట్రకు చెందిన 100 దేశీదారు సీసాలను మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం..పోలీసులకు తెలిసిన సమాచారం మేరకు గ్రామ సమీపంలో వెంకటేష్ వద్ద ఉన్న బ్యాగు తనిఖీ చేయగా దేశీదారు సీసాలు దొరికాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ఆమె వెంట పోలీస్ సిబ్బంది మధుకర్, రాంరెడ్డి ఉన్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లా స్థాయి యోగా పోటీలకు మంగళవారం క్రీడాకారులను ఎంపిక చేశారు. స్థానిక ఫాతిమా కాన్వెంట్ పాఠశాలలో అండర్-14, 17 బాల, బాలికలకు నిర్వహించిన పోటీల ద్వారా వీరిని ఎంపిక చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలలో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సాఫల్య, యోగా జిల్లా అసోషియేషన్ కార్యదర్శి కేసరి ఆలేఖ్య, జిల్లా కోచ్ ఏడుకొండలు, పతంజలి జిల్లా ఇన్‌ఛార్జి ఎం వెంకటేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు జి విద్యాసాగర్, పీడీలు కృష్ణప్రసాద్, బి తిరుపతి, స్వప్న, సత్యనారాయణ, కె రాకేష్, బి కిరణ్‌కుమార్, ఎన్ఐఎస్ యోగ కోచ్ దాసరి అరుణ పాల్గొన్నారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవిని మార్చండి



నవతెలంగాణ-కాసిపేట

బెల్లంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమురాజుల శ్రీదేవి అభ్యర్థిత్వాన్ని అధిష్టానం మార్చాలని అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజాబలం లేని వారిని అభ్యర్థిగా ప్రకటించి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వినోద్ గెలుపు కోసం ఆయన సోదరుడు మాజీ ఎంపీ గడ్డం వివేక్ వెంకట స్వామి తన రాజకీయ పదవీని అడ్డం పెట్టుకొని అన్న గెలుపుకు బలహీన అభ్యర్థిని పోటీలో పెట్టి రుణం తీర్చుకున్నాడని విమర్శించారు. రాష్ట్ర నాయకత్వం ఆయనకు ఎదురు చెప్పలేని నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతుందన్నారు. ఎనిమిదేళ్లుగా పార్టీ కోసం సర్వం త్యాగం చేసి నియోజకవర్గంలో పార్టీని గ్రామగ్రామానికి తీసుకెళ్లిన తనను పట్టించుకోవడం లేదన్నారు. పార్టీ కోసం నిజాయితీగా పని చేస్తున్న తనను బలి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బీబ్రాలో ఘనంగా ధమ్మచక్ర పరివర్తన దివస్



నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంతో పాటు మండలంలోని బీబ్రా గ్రామంలోని బుద్ధవిహార్, అంబేద్కర్ భవన్‌తో పాటు కొత్మీర్, బోర్లకుంట, ఇట్యాల తదితర గ్రామాల్లో ధమ్మచక్ర పరివర్తన దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్ధవిహార్‌లో బుద్ధిస్టు సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు చేశారు. కార్యక్రమంలో బుద్ధిస్టు సొసైటీ నాయకులతో పాటు పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

పోలీసులు ప్లాగ్ మార్చ్



కవాతు చేస్తున్న పోలీసులు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలను ముందస్తుగా ఎన్నికలు జరిగే ప్రాంతాలకు పంపిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం సిర్పూర్ మండలంలో పోలీస్‌స్టేషన్ నుండి గోవింద్‌పూర్ కాలనీలో ఉన్న శివాజీ విగ్రహం వరకు కేంద్ర బృందాలు కవాతు నిర్వహించారు. వీరి వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాదిక్‌పాషా, ఎస్సైలు దీకొండ రమేష్, మధూకర్, పోలీసులు ఉన్నారు.

పండగపూట విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలికలు మృతి • శోకసంద్రమైన పొన్కల్ గ్రామం

నవతెలంగాణ-జన్నారం

దసరా పండగ రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. ఒకే గ్రామంలో ఇద్దరు బాలికలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పొన్‌కల్ గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని పొనకల్ గ్రామానికి చెందిన పుప్పర్ల గంగన్న సోమవారం రాత్రి తన కూతురు రాహిత్య(15), ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సాగర్ కూతురు సాత్విక (19)లను బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి వెళ్తుండగా.. వడ్డేపల్లి చెరువు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరు బాలికలు వాహనంపై నుంచి దూరంగా పడిపోయారు. ఈ ఘటనలో రాహిత్య అక్కడికక్కడే మృతి చెందగా సాత్వికకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే కరీంనగర్లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ మేరకు స్థానిక ఎస్సై పీ.సతీష్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

వాహనాన్ని పట్టుకోవాలి

ఇద్దరు బాలికల మృతికి కారణమైన వాహనాన్ని పట్టుకోవాలని ఎమ్మెల్యే రేఖానాయక్ ఎస్సై సతీస్‌కు ఆదేశించారు. మంగళవారం మండలంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్సైతో మాట్లాడారు. సంఘటన జరిగిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో అన్ని సీసీ కెమెరాలు పరిశీలించి ఆ వాహనాన్ని గుర్తించి, ప్రమాదానికి కారణమైన వారిని పట్టుకుని వెంటనే కేసులు





నమోదు చేయాలని ఎస్సైని ఆదేశించారు. పండగ పూట ఇలాంటి దుర్ఘటన జరగడం బాదాకరమన్నారు. బాలికల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. వారి ఇళ్లలోకి వెళ్లి వారి తల్లిదండ్రులను పరామర్శించారు. వారి వెంట ఏఆర్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యం సతీష్ నాయకులు మున్న ఉన్నారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

దసరా వేడుకల్లో ఉద్రిక్తత

- వెల్గనూర్‌లో ఇరుగ్రూపుల పరస్పర దాడులు
- రోడ్డుపై బైటాయింపు- సీఐ హామీతో ఆందోళన విరమణ

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని వెలగనూరు గ్రామంలో దసరా వేడుకల్లో భాగంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దసరా వేడుకలకు నడుచుకుంటూ వెళ్తున్న పెట్టెం దుర్గయ్యకు కారు తగలడంతో గొడవ మొదలైంది. దీంతో కారులో ఉన్న వ్యక్తిని దుర్గయ్య బంధువులు నిలదీశారు. పక్కనే ఉన్న కారు నడిపే వ్యక్తి కొంతం నవీన్ మద్దతుదారులు అక్కడికి చేరుకోగా ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఎర్రవెని మొగిలి అనే వ్యక్తి తలకు గాయమైంది. అదే విషయమై మంగళవారం ఉదయం దుర్గయ్య ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగారు. దీంతో పెట్టెం వికాస్, శ్రీహరి, గడికొప్పుల రాకేష్, వంశీలకు గాయాలయ్యాయి. దీంతో ఆగ్రహించిన పెట్టెం దుర్గయ్య మద్దతుదారులు గ్రామంలోని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. అకారణంగా తమ ఇంటిపై వచ్చి దాడి చేసిన కొప్పుల శ్రీను అతని



వర్గంపై చర్యలు తీసుకునేంత వరకు ఆందోళన విరమించమని అక్కడే కూర్చున్నారు. లక్షెట్టిపేట సీఐ కృష్ణ అక్కడికి చేరుకొని న్యాయం జరిగేలా చూస్తామని, నిందితులపై కేసులు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఘనంగా దసరా వేడుకలు



కాగజ్‌నగర్ : శమీపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కోనప్ప దంపతులు



కాసిపేట : శమీ చెట్టుకు పూజ చేస్తున్న ప్రజలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

దసరా పండుగ వేడుకలు కాగజ్‌నగర్‌లో ఘనంగా జరిగాయి. సోమ, మంగళవారాలలో రెండు రోజలు పాటు ఈ దసరా పండుగను జరుపుకున్నారు. కొంతమంది సోమవారం పండుగ జరుపుకోగా, మరికొంతమంది మంగళవారం ఈ పండుగను జరుపుకోవడంతో రెండు రోజులు కాగజ్‌నగర్‌లో పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక త్రిశూల్‌పహాడ్‌పై ప్రతీ ఏడాది లాగే ఈ ఏడాది కూడా దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రావణాసురుని దిష్టిబొమ్మను దహనం చేశారు. ముందుగా సాయంత్రం ఆరు గంటలకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప దంపతులు చేతుల మీదుగా శమీ పూజను నిర్వహించగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు కూడా పాల్గొన్నారు. రాత్రి ఏడున్నరకు రావణాసురుని దిష్టిబొమ్మను దగ్దం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కాగజ్‌నగర్ డీఎస్‌పీ కరుణాకర్ ఆధ్వర్యంలో టౌన్ సీఐ బుద్దె స్వామి, రూరల్ సీఐ నాగరాజు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

కాసిపేట : మండలంలో ఆయా గ్రామాల్లో సోమవారం ఘనంగా దసరా వేడుకలు నిర్వహించారు. సోమగూడెం(బీ) గ్రామ పంచాయతీలోని శిశు మందిర్ క్రీడా మైదానంలో జమ్మి చెట్టుకు పూజలు చేసి దసరా వేడుకలను నిర్వహించగా ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం చిన్నా, పెద్దా, తేడా లేకుండా మహిళలు సైతం నృత్యాలు చేసి ఘనంగా దసరా వేడుకలు జరుపుకున్నారు. సోమగూడెం(కే) గ్రామ పంచాయతీలోని ట్యాంక్ బస్తీలోని క్రీడామైదానంలో దసరా వేడుకలు జరిపారు. ముత్యంపల్లి గ్రామంలో ముందుగా అంతా కలిసి పాల పిట్టను చూడడానికి వెళ్లి జమ్మి చెట్టుకు పూజలు చేసి ఒకరికి ఒకరు జమ్మి పెట్టుకొని శుభాకాంక్షలు తెలిపారు. దేవాపూర్లో దసరా వేడుకలను ఘనంగా జరిపారు.

దండేపల్లి : దసరా పర్వదిన వేడుకలు గ్రామాల్లో సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో గ్రామస్తులంతా జమ్మి చెట్టు వద్దకు బయలుదేరారు. సాయంత్రం పూట గ్రామ పొలిమేరల్లోని జమ్మి చెట్టు వద్దకు వెళ్లడం, అక్కడ పాలపిట్టను చూసి, తమ కోర్కెలు నెరవేరుతాయన్న నమ్మకంతో తమ ఇష్టదైవాలకు మొక్కుకున్నారు. మిత్రులు ఆత్మీయ అభిమానంతో అలయ్ బలయ్ తీసుకున్నారు. కాగా దేవీ విగ్రహాలు నెలకొల్పిన మండపాల వద్ద నవరాత్రి ఉత్సవాల ప్రారంభం రోజున చేసిన కలశ స్థాపన, దసరా రోజున రాత్రి కలశ ఉద్వాసన కార్యక్రమంతో నవరాత్రి ఉత్సవ వేడుకలు ముగిశాయి.





దండేపల్లి :

దేవాపూర్‌లో అశోక విజయదశమి



నవతెలంగాణ-కాసిపేట

మండలం దేవాపూర్ అంబేద్కర్ భవన్‌లో మంగళవారం అంబేద్కర్ సంఘ ఆధ్వర్యంలో అశోక విజయదశమి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందు అంబేద్కర్ యువజన సంఘం దేవాపూర్ అధ్యక్షుడు గసికంటి మల్లేష్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సంఘ సభ్యులు బుద్ధిష్టులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. తదనంతరం పంచశీల జెండాను గసికంటి మల్లేష్ ఎగరవేశారు. బుద్ధిష్ట మహిళా సంఘ సభ్యులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి బుద్ధ వందనం చేశారు. అనంతరం అంబేద్కర్ భవన్‌లో అంబేద్కర్ యువజన సంఘం కోశాధికారి చిప్పకుర్తి బాపు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో సామాజిక చైతన్య వేదిక అధ్యక్షుడు పల్లె మల్లయ్య ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు బుద్ధిస్ట్ సందీప్, అంబేద్కర్ వాది బ్రహ్మయ్య, బుద్ధిష్ట మహిళ సభ్యురాలు రజనీ పాలేకర్ దేవాపూర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు గసికంటి మల్లేష్, ముల్కల రాములు, రాజు పాలేకర్‌లు అశోక విజయదశమి గురించి అంబేద్కర్ భావజాలం గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు మహేష్, మహిళా సంఘం నాయకురాలు కొమ్ముల రజిత, బుద్ధిస్ట్ సంఘ సభ్యులు దాస్, గురుదాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గొర్లపల్లి ఎంపీటీసీ కాంగ్రెస్‌లో చేరిక



నవతెలంగాణ-వేమనపల్లి

ఎన్నికలు సమీపిస్తున్నవేల మండలంలోని బీఆర్ఎస్ గొర్లపల్లి ఎంపీటీసీ అదే చంద్రకళ-శంకర్ కాంగ్రెస్‌లో చేరారు. వేమనపల్లి మాజీ జడ్పీటీసీ నీల్వాయి ఎంపీటీసీ ఆర్.సంతోష్ కుమార్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాభీర్ అలీ అధ్వర్యంలో సోమవారం మాజీ మంత్రి, బెల్లంపల్లి కాంగ్రెస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం వినోద్ కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారి వెంట గొర్లపల్లి గ్రామ పంచాయితీ పరిధికి చెందిన సుమారు వంద మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి సర్పంచ్ గాలి మధు, మోర్ల రమేష్, ఇగురం జగన్, కొట్రంగి శ్రీనివాస్, ఠాకూర్ జలంధర్ సింగ్, పాయిలి లచ్చన్న, గోమాస శంకర్, నగోష కిష్టయ్య, బోర్కుటి ఇంద్రసేన, బోరుకుట్టి గణపతి, బొరుకుటి రాజన్న, మొగిలి గంగొలి, నాయిని శంకర్, నాయిని పున్నం, పాయిలి నరేష్, పాయిలి పున్నం, పాయిలీ సంపత్, నాయిని రాజు, నాయిని మారయ్య, ఏళ్ళది మల్లేష్, పాయిలి మల్లేష్, ఆవుల మల్లేష్, ఆవుల శంకర్, నాయిని కిష్టయ్య, పాయిలి వెంకటి పాల్గొన్నారు.

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ గుర్తింపు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

మొబైల్ పోగొట్టుకున్న బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చెయాలని ఈజ్ గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. మండలంలోని ఈస్ గాం గ్రామానికి చెందిన శాఖీర్ హుస్సేన్ తన వన్ ప్లస్ నార్డ్ మొబైల్ పోగొట్టుకోగా సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. పోర్టల్ ద్వారా మొబైల్ ట్రేస్ చేసి సోమవారం బాధితుడికి మొబైల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఈస్గాం ఎస్సై రామన్ కుమార్ మాట్లాడుతూ మొబైల్ పోయిన, దొంగిలించబడినా వెంటనే స్పందించి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలన్నారు. దీని ద్వారా మొబైల్ ట్రేస్ అవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుందన్నారు. పోర్టల్‌లో నమోదు చేయడానికి పోయిన మొబైల్‌లో ఉన్న సిమ్ నంబర్‌తో కొత్త సిమ్ తీసుకొని, ఆ మొబైల్ ఐఎమీఐ నెంబర్ తీసుకొని దగ్గరలో ఉన్న మీసేవకు వెళ్ళి ఆన్లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు. మొబైల్ ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీంను ఎస్సై అభినందించారు.

బోధన్‌లో పోలీసుల కవాతు

బోధన్‌టౌన్ : బోధన్ అసెంబ్లీ ఎన్నికల నేపత్యంలో బోధన్ పట్టణంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. పట్టణంలోని అచన్ పల్లి నుంచి ప్రారంభమైన కవాతు శక్కర్ నగర్ చౌరస్తా, కొత్తబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, పాతబస్టాండ్, రెంజల్ బేస్ తదితర ప్రాంతాలలో కొనసాగింది. ఈ సందర్భంగా ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజల్లో ఒక విశ్వాసాన్ని తీసుకురావడం కోసం ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రజలకు ఒక భరోసా కల్పించేందుకు తమ యంత్రాంగ అహర్నిశలు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు లోనవకుండా పోలింగ్ లో పాల్గొనాలని, శాంతి యుత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు సహకరించాలని ఆయన ప్రజలను సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ , రురల్ సీఐ లు ప్రేమ్ కుమార్, శ్రీనివాస్ ప్రసాద్, ఎస్ ఐ లు, పోలీసు సిబ్బంది తో పాటు ప్రత్యేక పోలీసు బలగాలు ఉన్నాయి.